

బస్సులో ఎమ్మెల్యే కవ్వంపల్లితో కలిసి ప్రయాణిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## ప్రజాకాంక్షలకు అనుగుణంగా పాలన

మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

మానకొండూర్ రూరల్, జనవరి 10 : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం మానకొండూర్ మండలం గంగిపల్లిలో బస్ షెల్టర్లు, ఓపెన్ జిమ్, కొండపల్కలలో ఆర్టీసీ బస్సు, నిజాయితీగూడెంలో జీపీ భవనాన్ని ప్రారంభించారు. అంతకు ముందు కొండపల్కల నుంచి గంగిపల్లి వరకు బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంత్రి మాట్లాడారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కంప్యూటరీకరణ చేస్తున్నామని, త్వరలోనే అర్హులందరికీ పథకాలను వర్తింపజేసే ప్రక్రియ మొదలుపెడుతామన్నారు. తిమ్మాపూర్‌లోని డ్రైవింగ్ స్కూల్ ట్రాక్‌కు చొక్కారావు పేరు అమలు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఆయన జన్మదినం రోజే కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ చొక్కారావు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, మీ సేవ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, దళారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజాపాలన నిర్వహించామని తెలిపారు. అంతకు ముందు గ్రామానికి చేరుకున్న మంత్రికి, ఎమ్మెల్యేకు నాయకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికి, సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, ఎంపీపీ ముద్దసాని సులోచన, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భూపతి రెడ్డి, డీఆర్డీవో శ్రీలత, జడ్పీ సీఈవో పవన్ కుమార్, డీఈవో జనార్దన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న గృహలక్ష్మి లబ్ధిదారులు

## 'గృహలక్ష్మి'ని కొనసాగించాల్సిందే..

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 10: గృహలక్ష్మి పథకాన్ని యథావిధిగా కొనసాగించి.. నిధులు వెంటనే మంజూరు చేయాలని జగిత్యాల నియోజకవర్గంలోని వివిధ మండలాల లబ్ధిదారులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థలం ఉండి ఇల్లు నిర్మించుకొనే వారికి గృహలక్ష్మి ద్వారా రూ.3లక్షల ఆర్థిక సాయం అందిస్తామని కేసీఆర్ ప్రభుత్వం ప్రొసీడింగ్ ఇవ్వడంతో నిర్మాణాలు ప్రారంభించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని బంద్ చేస్తామని చెప్పడంతో తామంతా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందారు. గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తామన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కింద తమకు సాయం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దళితబంధు పథకాన్ని సైతం కొనసాగించాలని పలువురు దళితులు కోరారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర అక్కడికి చేరుకున్నారు. గృహలక్ష్మి నిధుల విడుదల గురించి ప్రభుత్వానికి నివేదిస్తామని లబ్ధిదారులకు ఆయన హామీఇచ్చారు. ఇక్కడ జగిత్యాల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ కూసరి అనిల్, బీఆర్ఎస్ నాయకులు సమిండ్ల శ్రీనివాస్, వొద్ది రామ్మోహన్‌రావు, కత్తురోజు గిరి, లబ్ధిదారులు ఉన్నారు.

## పామూరుకు ఆర్టీసీ బస్సు రద్దు



మెట్‌పల్లి, జనవరి10: మెట్‌పల్లి పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు భవన నిర్మాణ రంగాల్లో పని చేస్తుంటారు. ప్రకాశం, నెల్లూరు, గుంటూరు తదితర ప్రాంతాలకు చెందిన వారంతా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి మెట్‌పల్లికి రాకపోకలు సాగిస్తుంటారు. వీరి కోసం పదిహేను ఏండ్ల నుంచి మెట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు (మెట్‌పల్లి-పామూరు) నడుస్తున్నది. ఈ బస్ సర్వీస్‌తో డిపోకు లాభమే తప్ప నష్టమే లేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించడంతో పామూరు-మెట్‌పల్లి మధ్య నడిచే బస్సుకు బ్రేక్ పడింది. దీంతో వలస కార్మికులు ఇబ్బందిపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్టీసీ కరీంనగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డిని వివరణ కోరగా, మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, అంతర్గత బస్ సర్వీసులను పెంచడం కోసం మెట్‌పల్లి-పామూరు మార్గంలో నడిచే ఎక్స్‌ప్రెస్ బస్‌ను రద్దు చేసినట్లు వివరించారు.



కరీంనగర్ డెయిరీ ఆవరణలో ముగ్గులు వేస్తున్న మహిళలు

## డెయిరీలో అలరించిన రంగవల్లులు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 10: సంక్రాంతి పండుగ సందర్భంగా కరీంనగర్ డెయిరీలో బుధవారం నిర్వహించిన రంగవల్లులు అలరించాయి. రైతు కుటుంబాల మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తీరొక్క రంగుల్లో ముగ్గులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ముందుగా నాబార్డు అధికారులు పోటీలను ప్రారంభించగా, కలెక్టర్ పమేలా సత్పతి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు, ఎండీ శంకర్‌రెడ్డి, సలహాదారు హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



ముగ్గును పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు

## 'సంక్రాంతి'కి అదనపు బస్సులు

కరీంనగర్ తెలంగాణచౌక్, జనవరి10 : సంక్రాంతి సందర్భంగా టీఎస్ ఆర్టీసీ అదనపు బస్సులు నడిపించనున్నది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల పరిధిలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులను తిప్పనున్నది. ఈ నెల 7 నుంచి 22వ తేదీ వరకు మొత్తం 1,395 సర్వీసులు, అందులో ప్రధానంగా హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో 1,195 బస్సులను అదనంగా నడుపనున్నది. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా డిపో-2 మేనేజర్ మల్లయ్య, స్టేషన్ మేనేజర్ అంజయ్యకు జూబ్లీ బస్టాండ్‌లో, ఆర్ఎం పర్యవేక్షణలో డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి, ఏటీఎం రజినీకృష్ణతోపాటు కంట్రోలర్లకు కరీంనగర్ బస్టాండ్‌లో విధులు కేటాయించింది. ప్రయాణికుల రద్దీ పెరుగనుండంతో బస్టాండ్ పరిసరాలు, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నది. కాగా, రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడుపుతామని కరీంనగర్ ఆర్ఎం సుచరిత తెలిపారు. ప్రత్యేక బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం ఉన్నదని, ప్రయాణికులు కూడా అదనపు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సెలవులు ముగిసిన తర్వాత కూడా హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం అదనంగా బస్సులు వేస్తామని, ప్రయాణికులకు అసౌకర్యాలు కలుగకుండా చూస్తున్నామన్నారు. ఎప్పటిలాగే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని చెప్పారు.

# ఎరువుల సరఫరాలో పారదర్శకత

- నిల్వలు, క్రయ, విక్రయాలకు సరికొత్త యాప్
- కొత్తగా 'ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం' యాప్
- డీఏవో నుంచి ఏవో వరకు అన్ని స్థాయిల్లో తనిఖీలు
- ఈ-పాస్‌లో వినియోగించకుంటే చర్యలు
- కరీంనగర్ జిల్లాలో 'ఫైవ్స్' ప్రారంభం

**ఎరువుల సరఫరాకు వ్యవసాయ శాఖ కొత్త పద్ధతులను అవలంబిస్తున్నది. ఎరువుల బస్తాలను సబ్సిడీపై ఇస్తున్న నేపథ్యంలో మరింత పారదర్శకత కోసం ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం (ఫైవ్స్) పేరిట ప్రత్యేక యాప్‌ను తెచ్చింది. పంటల నమోదులాగే ఇక నుంచి ఎరువుల షాపును ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, డీలర్‌కు కేటాయించిన ఎరువులను ఈ- పాస్ ద్వారా అమ్ముతున్నారా.. లేదా అనే విషయాలను నిత్యం పర్యవేక్షించనున్నది. ఎక్కడ తేడా వచ్చినా చర్యలు తీసుకోనుండగా, ఈ ప్రక్రియ బుధవారం కరీంనగర్ జిల్లా నుంచే ప్రారంభమైంది.**



కరీంనగర్‌లోని ఒక ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్

కరీంనగర్, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ రంగంలో ఎరువుల సరఫరా, నిల్వలు, పంపిణీ, అమ్మకం అనేది నిరంతర ప్రక్రియ. దీనిని పూర్తి పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా ఫైవ్స్‌ను ప్రవేశ పెట్టాయి. ఆ మేరకు ఒక ప్రత్యేక యాప్‌ను తెచ్చాయి. డీలర్లు ఎప్పటికప్పుడు ఎరువుల క్రయ విక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఆ యాప్‌లో నమోదు చేయాలి. ఈ-పాస్ మిషన్లను తప్పనిసరిగా వినియోగించాలి. వీటిపై యాప్‌లో సూచించిన మేరకు ఎరువుల షాపులను వ్యవసాయశాఖ యంత్రాంగం కూడా తనిఖీలు చేయనున్నది. పంటల నమోదు కార్యక్రమంలాగే ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. డీఏవో నుంచి ఏవో వరకు అన్ని స్థాయిల్లో అధికారులు తమకు కేటాయించిన దుకాణాలను తనిఖీ చేయనున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రతి ఏడు రోజులకు మూడు దుకాణాలు, డివిజనల్ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు ప్రతి మూడు రోజులకు పది రిటైల్ దుకాణాలు తనిఖీ చేయాలి. వారానికి 20 దుకాణాలు చెక్ చేయాలి. సంబంధిత అధికారులు ఎక్కడెక్కడి దుకాణాలు తనిఖీ చేయాలనేది హైదరాబాద్‌లోని కమిషనరేట్ నుంచే కేటాయింపు ఉంటుంది. ఆ మేరకు అధికారులు రెండు ప్రధానమైన విషయాలను పరిశీలించాలి. కంపెనీ వచ్చిన ఎరువుల సరఫరా ఈ-పాస్‌లో ధ్రువీకరించాలి. నిల్వలు, అమ్మకాలు కూడా ఈ-పాస్ ద్వారా జరపుతున్నారా? లేదా? చూడాలి. ప్రతి డీలర్ దుకాణంలో భౌతిక నిల్వలు ఈ-పాస్‌లో చూపబడుతున్న నిల్వలతో సమానంగా చూపిస్తున్నారా..? లేదా? అనే విషయాలను పరిశీలించాలి. అందులో రైతుల వివరాలు, వారి భూమి విస్తీర్ణం, ఆధార్ అనుసంధానంతో జరుగుతున్నాయా..? లేదా? అనేది రికార్డుల ఆధారంగా పరిశీలించాలి. రిజిస్టర్లలో సంతకాలు చేసి వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ ద్వారా ఎరువులు ఏ దుకాణంలో ఎంత అమ్ముతున్నారు? ఏ దుకాణంలో ఇంకా ఎన్ని నిల్వలు ఉన్నాయి? అనే విషయాలు జిల్లా నుంచి రాష్ట్రం, కేంద్ర స్థాయి అధికారులు కూడా నిత్యం పర్యవేక్షించడానికి అనుకూలంగా ఉంటుంది. అంతే కాకుండా ఎరువుల అమ్మకాల్లో ఎలాంటి జాప్యం జరిగేందుకు ఆస్కారం ఉండదు.

### కరీంనగర్ జిల్లాలో ప్రారంభం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలులోకి తెచ్చిన ఈ ఫైవ్స్ విధానాన్ని బుధవారం కరీంనగర్ జిల్లాలో వ్యవసాయ అధికారులు అమలులోకి తెచ్చారు. డీఏవో వాసిరెడ్డి శ్రీధర్ తనకు కేటాయించిన కరీంనగర్‌లోని 3 హోల్‌సేల్ దుకాణాలను తనిఖీ చేశారు. డివిజనల్ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు కూడా తమకు కేటాయించిన 10 దుకాణాల్లో కొన్నింటిని బుధవారం తనిఖీ చేశారు. ఈ విధానంపై డీలర్లకు కూడా అవగాహన కల్పించారు. ఎరువులు సక్రమంగా విక్రయించేందుకు ఈ-పాస్ మిషన్లను తప్పనిసరిగా వినియోగించాలని అధికారులు డీలర్లకు చెప్పారు. దుకాణాల్లో ఉన్న నిల్వలు, అమ్మకాలకు వ్యత్యాసం కనిపిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో ఎరువుల నిల్వలు సరిపడా ఉన్నాయని డీఏవో శ్రీధర్ తెలిపారు. ఇక నుంచి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లోనే డీలర్లు ఎరువుల క్రయ, విక్రయాలు జరపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అందుకు విరుద్ధంగా కంపెనీల నుంచి వచ్చిన ఎరువులను ఈ-పాస్‌లో నమోదు చేయకున్నా, రైతులకు విక్రయించినా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.


# నువ్వులు పండించాలి

- నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలి
- విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి
- పురుగు మందులు తగ్గించి భూమిని కాపాడుకోవాలి
- డిమాండ్ ఉన్న పంటలే వేయాలి
- రైతులకు జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మీన్ భాషా సూచన
- పొలాసలో కిసాన్ మేళా (నువ్వులు) 2024 సక్సెస్
- రైతులు-శాస్త్రవేత్తల చర్చాగోష్ఠి
- మూడు ఉమ్మడి జిల్లాల నుంచి 2వేల మంది రైతుల రాక



కిసాన్ మేళా స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్ బాషా

జగిత్యాల టౌన్, జనవరి 10 : రైతులు సమగ్ర వ్యసాయం చేయాలని, నాణ్యమైన నువ్వుల పంటలను పండించాలని జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మీన్ బాషా రైతులకు సూచించారు. విదేశాలకు ఎగుమతి చేసేలా నాణ్యమైన ఉత్పత్తులను సాధించాలని చెప్పారు. ఎథికల్ అగ్రికల్చర్‌ను నేర్చుకోవాలని, పురుగు మందులను తగ్గించి రానున్న తరం కోసం భూమిని కాపాడుకోవాలని నిర్దేశం చేశారు. బుధవారం పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధనా మండలి, యూనియన్ బ్యాంక్, భారత నూనెగింజల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కిసాన్ మేళా (నువ్వులు)-2024 నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల సుమారు 2వేల మంది రైతులు తరలిరాగా, నువ్వుల పంట సాగుపై శాస్త్రవేత్తలు చర్చాగోష్ఠి చేశారు. ఈ మేళాకు కలెక్టర్ హాజరై, మాట్లాడారు. రైతులు వ్యాపారులుగా మారినప్పుడే ఆదాయాన్ని పెంచుకోగలుగుతారని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. పాత రోజుల్లో ప్రతి కుటుంబానికి సరిపడా నూనె గింజలు, పప్పు దినుసులు, అనేక ఆహార ధ్యానపు పంటలను పండించుకొనే వారని గుర్తు చేశారు. మళ్లీ పాత కాలం రోజులు రావాలని, రైతులు సమగ్ర వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. రూ.కోట్లు పెట్టి నూనెలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థితిలో ఉన్నామన్నారు. ఎప్పుడు ఒకే పంట వేయకుండా నువ్వుల లాంటి పంటలను వేసుకోవాలని సూచించారు. అయితే నువ్వులను ఎగుమతి చేయడానికి కొన్ని దేశాల్లో కొన్ని రకాల స్టాండట్స్ ఉన్నాయని, అందుకనుగుణంగా ఉత్పత్తి చేసినప్పుడే కొనుగోలు చేస్తారని చెప్పారు. ప్రతి రైతు ఇంటికి పెరటి కూరగాయలను సాగు చేయాలన్నారు. తాను వనపర్తిలో ఉన్నప్పుడు 'మా ఇంటి పంట' అని ఆర్గనైజ్ చేశామని, రైతులకు ఫ్రీగా కూరగాయల విత్తనాలు అందించామన్నారు. ఆయిల్‌పామ్‌పై రైతులు అనుమానాలు పెట్టుకోవద్దని, లోహియా అనే కంపెనీ మనకు మొక్కలను అందిస్తుందని, దిగుబడిని కూడా అదే కంపనీ కొనుగోలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ కిషోర్ థాన, ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్‌కుమార్ విశ్వకర్మ, నూనెగింజలు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ వాణిశ్రీ, ఫుడ్‌సైన్స్ కళాశాల డీన్ డాక్టర్ కల్పన, డిప్యూటీ సీఈవో రమేశ్‌కొల్లా, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి ఈ సందర్భంగా నూనె పంటల సాగు, యంత్రాలపై సబ్సిడీ రుణాలు వంటి అంశాలను వివరించారు.




ఆయిల్‌పామ్ గురించి రైతులకు వివరిస్తున్న అధికారులు

### నువ్వుల వాడకం ఎక్కువ

రాష్ట్రంలో సంక్రాంతి పండుగతో పాటు సాధారణంగా నువ్వుల వాడకం ఎక్కువగా ఉంటుంది. మనం దాని ఉత్పత్తి పెంచాలి. భారతీయ నువ్వులు ఎక్స్‌పోర్టుకు పనికి రావాలంటే నాణ్యతను పెంచాలి. ఉత్తర తెలంగాణలోని రైతులు శాస్త్రవేత్తలతో కలిసి ఒక వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి పంటల సాగులో వచ్చే సమస్యలను పరిష్కరించుకోవాలి. ప్రస్తుతం రూరల్ అగ్రి హబ్‌ను ఏర్పాటు చేశాం. యువ రైతులు దానిని వినియోగించుకోవాలి. మా యూనివర్సిటీ యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజంటేషన్స్ చేస్తున్నది. రైతులు సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి. ఒక పంటపైనే కిసాన్ మేళా జరగడం ఇదే మొదటిసారి. నువ్వుల పంటలో అధిక ఉత్పాదకత సాధించిన రైతులకు అవార్డులు, ప్రోత్సాహకాలు అందిస్తాం.

- డాక్టర్ వీ సుధారాణి, విస్తరణ సంచాలకులు


### నువ్వుల పంటపై దృష్టిసారించండి



ప్రస్తుతం రాష్ట్రంలో 50 వేల ఎకరాల్లో నువ్వు పంట సాగవుతున్నది. నువ్వు పంటలో రాజేశ్వరి, స్వేతాథిల్ అనే రకాలు మేలైనవి. తెలంగాణ ఏర్పడిన తర్వాత 1020 అనే రకం ప్రాచుర్యం పొందింది. కొన్నేళ్ల కిందట వానకాలంలో నల్ల నువ్వులను లక్షల ఎకరాల్లో సాగు చేసేవారు. రాను రాను దాని సాగు అంతరించిపోయింది. యాసంగిలో పసుపు, పత్తి పంటల తర్వాత నువ్వు సాగు చేయడం ద్వారా ఎకరానికి 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. నాణ్యతను పెంచితే విదేశాలకు ఎగుమతి చేసుకొనే పరిస్థితులు ఏర్పడతాయి. కర్ణాకట రాష్ట్రంలోని బీదర్‌లో చెరుకులో అంతరపంటగా నువ్వులను సాగు చేస్తున్నారు. మన రాష్ట్రంలో 45 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నాం. దాని తర్వాత నాలుగు తడులు ఇస్తే నువ్వు పంటను సాగు చేసుకోవచ్చు. దీని వల్ల ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మేళాకు వచ్చిన రైతులు నాణ్యమైన నువ్వులను పండించి విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి.

- డాక్టర్ రఘురాంరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ (ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం)

### 20 శాతానికి ఉత్పత్తి పెంచాలి



ప్రతి సంవత్సరం రూ.1,67,220 కోట్ల విలువైన నూనెను దిగుమతి చేసుకుంటున్నాం. ప్రస్తుతం దేశంలో నూనె ఉత్పత్తి 9 శాతం మాత్రమే ఉంది. దాన్ని 20 శాతానికి పెంచాలి. రైతులు యాజమాన్య పద్ధతుల్లో మార్పు చేస్తే నూనె గింజల ఉత్పాదకత పెరుగుతుంది.

- ఎస్‌వీ రమణారావు, అఖిల భారత నూనెగింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త, హైదరాబాద్



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్

## సీ-సెక్షన్ ఆపరేషన్లు చేయద్దు

- లింగనిర్ధారణ, అబార్షన్లపై కఠినంగా వ్యవహరించాలి
- నిబంధలను పాటించని దవాఖానలపై చర్యలు తీసుకోండి
- అనుమతులు లేని ఐవీఎఫ్, ఐయూఎఫ్ హాస్పిటళ్లను గుర్తించండి
- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్ విద్యానగర్, జనవరి 10: అవసరం లేకపోయిన సీ-సెక్షన్ ఆపరేషన్ ద్వారా ప్రసవాలను చేసే డాక్టర్లు, దవాఖానలపై చర్యలు తీసుకోవాలని అధికారులను వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ పని తీరుపై బుధవారం రాత్రి కలెక్టర్, వైద్య శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేటు దవాఖానలు, ల్యాబ్‌లపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. సరైన అనుమతులు, అవసరమైన వైద్యులు మొదలైనవి లేకుండా ఐవీఎఫ్, ఐయూఎఫ్‌ను అందించే దవాఖానలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో లింగనిర్ధారణ, అబార్షన్ చేసే వారిపై కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలని ప్రవేశపెట్టిన ఆరోగ్యమహిళా కార్యక్రమాన్ని జిల్లాలోనే మొదటగా ప్రవేశపెట్టామన్నారు. ప్రాథమిక దవాఖానల్లో కొన్ని రకాల ఆరోగ్యశ్రీ సేవలను అందించేలా తీర్చిదిద్దాలన్నారు. వైద్యశాఖ ద్వారా జరిగే ప్రతి పని సంబంధిత పోర్టల్లో నమోదు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, సూపరింటెండెంట్ వీరారెడ్డి వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఈ-ఫైలింగ్ ద్వారా కేసుల దాఖలు

- పైలెట్ ప్రాజెక్టుగా కరీంనగర్ జిల్లా కోర్టులు ఎంపిక
- వచ్చే నెల 8 నుంచి ప్రారంభం

కోర్టుచౌరస్తా, జనవరి 10 : ఆన్‌లైన్ ద్వారా సివిల్ కేసుల దాఖలుకు కరీంనగర్ జిల్లా కోర్టులను పైలెట్ ప్రాజెక్టుగా హైకోర్టు ఎంపిక చేసింది. అందుకు సంబంధించి జిల్లా జడ్జి బీ ప్రతిమ బుధవారం సర్క్యులర్ విడుదల చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రస్తుతం కోర్టుల్లో కేసుల దాఖలు ఫిజికల్ ద్వారా చేస్తున్నారు. అయితే ఆన్‌లైన్ ద్వారా దాఖలుకు ఈ-ఫైలింగ్ విధానాన్ని జిల్లా కోర్టులతోపాటు అదనపు జిల్లా కోర్టుల్లో వచ్చే నెల 8 నుంచి ప్రవేశపెడుతున్నారు. దీనికి సంబంధించి ఈ-ఫైలింగ్ చేసే న్యాయవాదులు మొదట తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ నెంబర్, ఫోన్ నెంబర్, ఈమెయిల్ ఐడీ పొందుపరిచి అప్లికేషన్ ఫాంను ఈ నెల 25 వరకు జిల్లా కోర్టులో అందించాలి. అనంతరం న్యాయవాదులు సొంతంగా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో పొందుపరిచిన వివరాలు చేర్చి యూజర్ ఐడీ, పాస్వర్డ్ పొందాలి. ఈ అప్లికేషన్ ఫాంలను జిల్లా కోర్టు వెబ్ సైట్ నుంచి పొందవచ్చు. ఫైల్ చేసేటప్పుడు బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ నెంబర్ నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో ఫైలింగ్ చేసేటప్పుడు హైకోర్టు చూపిన మార్గదర్శకాల ప్రకారం చేయాలి. పూర్తి వివరాలకు https://filing.ecourts.gov.in/pdedev/ తెలుసుకోవచ్చు.

## చైల్డ్‌పోర్న్ వీడియోలు చూస్తే జైలే

వేములవాడ రూరల్, జనవరి 10: ఎవరైనా చైల్డ్‌పోర్న్ వీడియోలు చూసినా, ఇతరులకు షేర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లికి చెందిన మల్యాల అరవింద్ చైల్డ్‌పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి ఇతరులకు టెలీగ్రామ్ ద్వారా షేర్ చేయడంతో వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అందుకు సంబంధించిన వివరాలను బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ వెల్లడించారు. చెక్కపల్లి శివారులోని పెద్దమ్మ గుడి మల్యాల అరవింద్ అనుమానాస్పదంగా కనిపించడంతో ఎస్ఐ మారుతి మందలించాడు. ఈ క్రమంలో అతడి ఫోన్‌ను ఎస్ఐ పరిశీలించగా, అందులో చైల్డ్‌ఫోర్న్ వీడియోలు ఉన్నట్టు గుర్తించాడు. అరెస్టు చేసి విచారణ చేయడంతో టెలీగ్రామ్ యాప్ ద్వారా దాదాపు 729వీడియోలు డౌన్‌లోడ్ చేసి, ఇతరులకు పంపి ₹30వేలు సంపాదించినట్లు అరవింద్ చెప్పాడు. ఈ మేరకు అరవింద్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

## రవాణా శాఖలో బదిలీలు

తిమ్మాపూర్, జనవరి 10 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్‌లో ఎంవీఐగా పని చేస్తున్న గౌస్‌పాషా ఖమ్మం జిల్లాకు, మసూద్ అలీ, సిరాజుర్ రహ్మాన్ పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఖమ్మంలో పని చేస్తున్న శ్రీనివాస్, హుస్నాబాద్‌లో పని చేస్తున్న ఠాకూర్ ఈశ్వర్ సింగ్ కరీంనగర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇన్‌చార్జ్ అధికారులు, అదనపు బాధ్యతలను ప్రభుత్వం తొలగించడంతో ఈ ట్రాన్స్‌ఫర్లు జరిగినట్లు ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు.